క్లుప్తంగా

50 రోజులుగా అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మాలధారులు

తాటిచెట్లపాలెం : రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ప్రారంభించిన ప్రత్యేక అన్నదానానికి మంగళవారంతో 50 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ నవంబరు 4 నుంచి మాలధారులకు ప్రత్యేక అన్నదానం ప్రారంభించామని, మంగళవారంతో 50 రోజులు పూర్తయ్యాయని తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో మరికొన్ని రోజులు అన్నదానం కొనసాగిస్తామన్నారు. మాలధారులంతా అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

విశేషంగా ధూప పాశురం



శ్రీలలితాపీఠంలో ధూప పాశురం విన్నవిస్తున్న భక్తులు

సీతంపేట : ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ధూప పాశురం విశేషంగా విన్నవించారు. శ్రీభూ, నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరునికి భక్తులు ధూప హారతి సమర్పించి, పాశురం విన్నవించారు. ముందుగా సుప్రభాతం, స్వామి అమ్మవార్లకు అర్చన, బాలభోగం నివేదించారు. ప్రసాద నివేదన అనంతరం నక్షత్ర హారతి సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఈ నెల 26న ఉదయం 10 గంటలకు అష్టభుజ సుదర్శన ధన్వంతరి హోమం, సాయంత్రం సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు



కాంతమ్మను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: అరకు మండలం పాడువా గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కాంతమ్మ (70)కు ముగ్గురు కూతుళ్లు. ఐదేళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతోంది. వైజాగ్‌లో కూతురు, అల్లుడి దగ్గరికొచ్చి వాళ్లతో గొడవపడి ఇల్లు వదిలేసి రైల్వే స్టేషన్లో భిక్షాటన చేస్తూ బతుకుతోంది. సమాచారం తెలుసుకున్న ఏయూటీడీ రెగ్యులర్ రెస్క్యూ టీం ఈమెను గుర్తించి టీఎస్ఆర్ మహిళా షెల్టర్‌కు తరలించారు. శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా చికిత్స జరుగుతుండగానే అల్లుడు రమేష్‌కి కబురు పెట్టి రప్పించారు. మందులు ఎలా వాడాలో చెప్పి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో కాంతమ్మను అల్లుడు రమేష్‌కు అప్పగించారు.

ఏయూ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

విశాఖ విద్య : ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే ఏయూ అథ్లెటిక్స్ పురుషులు, మహిళల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయరావు అథ్లెటిక్స్ జట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ సాధించి వర్సిటీ కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్వీ జయమోహన్ మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. జట్టు కోచ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీడీ ఎస్.అప్పారావు, గణేష్ పాల్గొన్నారు.



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో అసంపూర్తిగా వదిలేసిన కారిడార్లు

అసంపూర్తి కారిడార్లతో అవస్థలు

బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రమాదాలు

అదుపు తప్పుతున్న వాహనదారులు



ఐటీఐ కూడలిలో బారికేడ్ల దిమ్మ పైకి దూసుకుపోయిన కారు

కంచరపాలెం : 'శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ' (బీఆర్‌టీఎస్)తో ప్రజా రవాణాలో ప్రత్యేకత సంతరించుకునేందుకు, ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ రహదారులను నిర్మించారు. బీఆర్‌టీఎస్‌లో జేఎన్ఎన్ఆర్‌యూఎం బస్సుల కోసం నిర్మించిన ప్రత్యేక రహదారికి, సబ్‌వే మార్గాలకు అనుసంధానంగా కారిడార్లు ఏర్పాటు చేశారు. కంచరపాలెం కూడలి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, అటు జ్ఞానాపురం కాన్వెంటు కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రహదారిలో కారిడార్లు అసంపూర్తిగా నిర్మించడంతో ప్రయాణికులకు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నేతాజీ ఫ్లైఓవర్ కూడలి, కంచరపాలెం రైతుబజార్, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో కారిడార్లు విరిగిపోయి నేలకొరిగిపోవడంతో రోడ్లు దాటే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాస్తవానికి ఈ కారిడార్లు సంపూర్ణంగా ఉంటే పాదచారులు సమీపంలోని కూడలి వద్దకు వెళ్లి అక్కడ రోడ్డు దాటే అవకాశం ఉంటుంది. అయితే కారిడార్లు అసంపూర్తిగా వదిలేయడంతో చాలా మంది పాదచారులు ఇష్టారాజ్యంగా రోడ్డు దాటేస్తున్నారు. కారిడార్లు దాటి బీఆర్‌టీఎస్ మార్గాన సబ్ వేలోకి వెళ్లేటప్పుడు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు కారిడార్లు దాటే పాదచారులు ఒక్కసారిగా రావడంతో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.



ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న యువతి

కారిడార్లు ఏర్పాటు చేయాలి

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్ల వద్ద రోడ్లు దాటేటప్పుడు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు అతివేగంతో బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన మార్గాల్లో కారిడార్లు లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో సరిపెడుతున్నారు.

– ఎం.శ్రావణి, ఐటీఐ జంక్షన్

మూలకు చేరిన కారిడార్లు

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్లు తుప్పు పట్టి మూలకు చేరాయి. జోన్ – 5 ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కారిడార్లు మూలకు చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నేలకు ఒరగడంతో స్క్రాప్ దుకాణాలకు చేరుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మిగిలిన కారిడార్లకు రంగులు వేస్తే కనీసం కొంత కాలం రహదారుల్లో నిలుస్తాయని చెబుతున్నారు.



దుర్గానగర్ వద్ద బారికేడ్లు దాటుతున్న పాదచారులు

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కారిడార్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



జోన్ పరిధి బీఆర్‌టీఎస్ రహదారుల్లో పలు ప్రాంతాల్లో టీడీఆర్‌లు తీసుకోకుండా కోర్టుకు వెళ్లడంతో రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రమాదకర కూడళ్లలో కారిడార్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగాధికారులతో మాట్లాడి బీఆర్‌టీఎస్ రహదారుల్లో అవసరమైన చోట్ల కారిడార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్, జోన్ – 5

హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

సీతంపేట : వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల తొలగించిన తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు సీతంపేట కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని, ముఖ్యమంత్రి దృష్టికి తమ సమస్యని తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వీలైనంత త్వరగా మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సాయికిరణ్, కృష్ణమోహన్, నాగరాజు, లంక శ్రీను, వేణుబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లా శ్రీనువాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

ఘనంగా ప్రసన్నభారతి సాహిత్యోత్సవాలు

సీతంపేట : ప్రసన్న భారతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం సాహిత్యోత్సవాలు నిర్వహించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రసన్నభారతి పత్రిక వ్యవస్థాపకులు కొండేపూడి సుబ్బారావు చేసిన సాహిత్య సేవను వివరించారు. సంస్థ కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ప్రసంగిస్తూ పలు అంశాలు వివరించారు. ప్రముఖ పద్య కవి బులుసు వెంకటేశ్వర్లు పత్రిక విశిష్టతను వివరించారు. అనంతరం రచయిత మంగు శివరామప్రసాద్ రచించిన భోజ ప్రబంధ కావ్యాన్ని శరత్‌బాబు చేతుల మీదుగా ఆవిష్కరించి సమీక్షించారు. ప్రసన్నభారతి శతక సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత బండికాడ అంజయ్య గౌడ్‌కు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పద్య పఠనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు, రామబ్రహ్మం, సూర్యారావు, తదితరులు

పేట్రేగిపోతున్న ఆకతాయిలు, రౌడీషీటర్లు

పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటున్న నగరవాసులు



మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రౌడీషీటర్లకు, ఆకతాయిలకు ప్రతీ ఆదివారం తూతూ మంత్రంగా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేస్తున్నారని, దీంతో వారు భయపడకుండా రెచ్చిపోతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు మీద ఒంటరిగా వెళ్తున్న స్థానికులతో చిన్నచిన్న విషయాలకే గొడవపడి వారిపై దాడి చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- కొద్ది రోజుల క్రితం బర్మా క్యాంప్ సిగ్నల్ పాయింట్ వద్ద మద్యం మత్తులో ఓ యువకుడు బ్లేడ్‌తో అటుగా వెళ్తున్న ముగ్గురిపై దాడి చేయడం అప్పట్లో కలకలం సృష్టించింది.
- నెల రోజుల క్రితం కైలాసపురం కస్తూరినగర్‌లో మద్యం మత్తులో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు అటుగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి ఆస్పత్రికి తరలించమని కోరగా... అందుకు సదరు వ్యక్తి అంగీకరించకపోవడంతో కత్తితో అతనిపై యువకుడు దాడి చేసి పారిపోయాడు. అప్పట్లో ఆ నిందితుడి కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి పలు రాష్ట్రాలకు పరుగులు తీసి మరీ వెతికారు. నేటికి నెల రోజులు దాటుతున్నా నిందితుడిని మాత్రం ఇప్పటి వరకు పట్టుకోలేకపోయారని పలువురు ఆరోపిస్తున్నారు.
- తాజాగా ఆదివారం రాత్రి కంచరపాలెం పెద్ద కొత్తూరులోని సచివాలయం సమీపంలో అటుగా వెళ్తున్న శ్రావణ్‌కుమార్ అనే వ్యక్తి చికెన్ రోల్స్ ఇవ్వలేదని ఓ రౌడీషీటర్ బైక్ తాళాలతో అతడిపై దాడి చేశాడు. ఈ కేసు విషయమై సదరు రౌడీషీటర్‌ని అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు తెలుస్తోంది. ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో రౌడీషీటర్లు, ఆకతాయిలపై పోలీసులు ఉక్కుపాదం మోపేవారు. కానీ ప్రస్తుతం పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా ఆకతాయిలు, రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారని స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌పై దృష్టి సారిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సరోగసీ దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట: సరోగసీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ సమావేశ మందిరంలో సరోగసీ మెడికల్ బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరోగసీ తల్లి వివరాలు, ఆరోగ్య పరిస్థితి పూర్తిగా పరిశీలించాలన్నారు. సరోగసీ కోరుకుంటున్న వారి అర్హత పత్రాలు, విధి విధానాలను కమిటీ సభ్యులకు అందజేశారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి సరోగసీకి ఒకసారి అనుమతించేందుకు అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ బి.చక్రవర్తి సరోగసీ చేసుకునే వారిని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార : మనస్తాపంతో ఓ యువకుడు గడ్డి మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం, దయానంద్ నగర్‌లో తల్లితో కలిసి వి.వెంకటేష్ (27) నివసించేవాడు. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులోని సంఘమిత్ర సోషల్ సర్వీస్ యాజమాని వద్ద పని చేసేవాడు. మానసికంగా ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద తల్లి మందలించడంతో సోమవారం ఉదయం తాను పనిచేస్తున్న సంఘమిత్ర సోషల్ సర్వీస్ కార్యాలయంలో గడ్డి మందు తాగాడు. దీంతో యాజమాని చూసి వెంటనే కేజీహెచ్‌కు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తల్లి సూర్యం ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కె.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జైలు శిక్ష

మర్రిపాలెం : కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 12 మంది పోలీసులకు పట్టుబడ్డారని వెల్లడించారు. వారిలో 9 మందికి రూ.10 వేల నుంచి రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.1.05 లక్షలు జరిమానా విధించారు. మరో ముగ్గురు మర్రిపాలెం ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ పి.అప్పలనాయుడు, పీఎంపాలెంకు చెందిన కారు డ్రైవర్ చంద్రకాంత్ పటేల్, షీలానగర్‌కు చెందిన కారు డ్రైవర్ వెంకటేష్‌కు 8 రోజుల చొప్పున జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్టు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గేట్ నంబర్ 2 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. స్టేషన్ మాస్టర్ సమాచారంతో గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రైల్వే స్టేషన్ గేట్ నంబర్ 2 వద్ద సుమారు 70 సంవత్సరాల వయసు గల వృద్ధుడు మరణించినట్లు స్టేషన్ మాస్టర్ గమనించి, సమాచారం అందించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలూ లేవు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసు ఎస్ఐ కె.శాంతారామ్‌ను స్వయంగా, లేదా 76739 06010లో సంప్రదించాలని కోరారు.

పరారైన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : గంజాయి కేసులో పరారైన వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గతంలో గంజాయి తరలించిన కేసుల్లో కీలకమైన మర్రి డోమ్మ కొద్ది రోజులుగా పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలిస్తున్న పోలీసులకు స్టేషన్ పరిధిలో ఉన్నట్లు అందిన సమాచారంతో మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ రంగ ప్రైవేటీకరణ తగదు

- ప్రభుత్వాల చర్యలపై తీవ్రంగా పోరాడుతాం
- కార్మికుల పోరాటానికి సీఐటీయూ సంఘీభావం



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : చండీఘర్‌లో విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి కార్మికుల చేస్తున్న పోరాటానికి సీఐటీయూ సంఘీభావం తెలియజేస్తుందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ తెలిపారు. విద్యుత్ డిస్కమ్‌ల ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని గురుద్వారా వద్ద గల ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలు వేగవంతం చేసిందని ఆరోపించారు. చండీఘర్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ 'ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి' విక్రయించేందుకు డిసెంబర్ 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతంలో లాభాలు గడించే చండీఘర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేటు వారికి అప్పచెప్పడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అక్కడి కార్మికులు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న చలో చండీఘర్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని, అందులో భాగంగానే ట్రూ అప్ చార్జీలు పేరుతో వినియోగదారులపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రైవేటీకరణ చర్యలను ప్రభుత్వం విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికుల మద్దతుతో పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, ఎం.సుబ్బారావు, నాయకులు యూఎస్ఎన్ రాజు, పి.వెంకటరావు, జి.అప్పలరాజు, వి.కృష్ణారావు, జి.పోలేశ్వరరావు, కె.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ స్ఫూర్తి కేంద్రం దేశానికే గర్వకారణం

సీతమ్మధార : శ్రీశైలంలో శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రం ఏర్పాటుకు వడ్లమూడి రామ్మోహనరావు చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ప్రపంచంలో మరెక్కడా శివాజీకి లభించని గౌరవం, ఆయన పేరుమీద స్మారక కేంద్రం శ్రీశైలంలో ఉండడం దేశానికే గర్వకారణమన్నారు. గురుద్వారా సమీపంలోని ఓ హోటల్‌లో శ్రీ శివాజీ స్మారక కేంద్రం 50వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లమూడి రామ్మోహనరావు సోదరుడు వడ్లమూడి బ్రహ్మానందరావును ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ మహారాజ్ స్మారక కేంద్రం 50వ వార్షికోత్సవం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రామ్మోహనరావును స్ఫూర్తిగా తీసుకుని దేశహితానికి అందరూ పనిచేయాలన్నారు. శివాజీ మహారాజ్, స్వామి వివేకానంద వంటి మహనీయుల జీవిత చరిత్ర వింటేనే ఎంతో స్ఫూర్తి కలుగుతుందన్నారు. శివాజీ మెమోరియల్ కమిటీ సెక్రటరీ రఘురామయ్య మాట్లాడుతూ 1973 నుంచి రామ్మోహనరావుతో కలిసి నడిచామన్నారు. డాక్టర్ వడ్డి విజయ సారథి మాట్లాడుతూ శివాజీ స్ఫూర్తి కేంద్రం ఏర్పాటులో, జాగృతి పత్రిక సంపాదకత్వంలో రామ్మోహనరావు చేసిన కృషి, అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



వడ్లమూడి బ్రహ్మానందరావుని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు

ఆక్రమణల తొలగింపు

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఈ మేరకు మంగళవారం మర్రిపాలెం గ్రీన్ గార్డెన్స్ వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారి షాపులు తొలగించారు. ఇటీవల కాలంలో బిర్లా జంక్షన్ వద్ద ఓ షాపింగ్ మాల్ నిర్మాణంలో గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో వారిపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. దానిని ఆసరాగా తీసుకుని మర్రిపాలెం గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై అధికారులు ప్రతాపం చూపించారని కొందరు అంటున్నారు. బడా వ్యాపారాలు నిర్వహించే వారి వద్ద కాసులకు కక్కుర్తిపడి చూసీ చూడనట్టు వదిలేస్తున్న అధికారులు..., చిరు వ్యాపారుల పొట్ట కొట్టడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేస్తే తప్ప పూట గడవని వారి బతుకులు రోడ్డున పడేయడం చాలా అన్యాయమని స్థానికులు అంటున్నారు.



షెడ్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 23వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అష్టదళ పద్మారాధన పూజలో 13 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో మేయర్ దంపతులు

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు మంగళవారం సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఇలవేల్పు కనకమహాలక్ష్మిని మార్గశిర మాసంలో దర్శించుకుంటే సిరిసంపదలతో పాటు సకల పాపాలు నశించి మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సమకూరుతాయని తెలిపారు. విశాఖ నగరాభివృద్ధి జరగాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్టు మేయర్ తెలిపారు.